క్లుప్తంగా

వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: అత్యంత వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఐమాక్స్ థియేటర్ సమీపంలోని ఓపెన్ గ్రౌండ్‌లో వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా బీసీడీవో బి. రాజమనోహర్‌రావు తెలిపారు. కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల మొదలైన వృత్తుల వారు రూపొందించిన వైవిధ్యమైన వస్తువులున్నాయన్నారు. ఈనెల 29 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో వెనుకబడిన తరగతులకు చెందిన వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

'కస్తూర్బా' పాఠశాల తనిఖీ



చందుర్తి : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీవో రాధ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసర ప్రాంతాలు, వంటగది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వారికి సూచించారు. ఆమె వెంట ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, పాఠశాల ప్రత్యేకాధికారి కల్పన, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై ఉపేంద్రచారి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ఎస్సైగా ఎం.ఉపేంద్రచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన బి.రామ్మోహన్ వేములవాడ టౌన్‌కు బదిలీకాగా ఉపేంద్రచారి కరీంనగర్ నుంచి బదిలీపై వచ్చారు. ఎస్సై మాట్లాడుతూ సివిల్ తగాదాలకు సంబంధించి కోర్టులను ఆశ్రయించాల ని, అసాంఘిక కార్యకలాపాలకు దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎల్లారెడ్డిపేట ఎస్సైగా రాహుల్ రెడ్డి




ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఎస్సైగా కె.రాహుల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రమాకాంత్ గంభీరావుపేటకు బదిలీ అయ్యారు. శిక్షణ ఎస్సైగా ఉన్న రాహుల్‌రెడ్డిని ఎల్లారెడ్డిపేట ఎస్సైగా నియమిస్తూ.. ఎస్పీ మహేశ్ బీ గీతే ఉత్తర్వులు జారీచేశారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, నద్ది లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని రాహుల్‌రెడ్డి కోరారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండల అదనపు ఎస్సైగా శ్రీనివాసరావును నియమిస్తూ ఎస్పీ మహేశ్ బీ గీతే ఉత్తర్వులు జారీచేశారు. ఇల్లంతకుంట ఎస్సైగా ఇప్పటికే సిరిసిల్ల అశోక్ విధులు నిర్వర్తిస్తుండగా రెండో ఎస్సైగా శ్రీనివాసరావును నియమించారు.

రుద్రంగి: రుద్రంగి ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వేములవాడ టౌన్ ప్రొబిషనరీ ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చి రుద్రంగి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్సై శ్రీనివాస్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గామాతకు 108 కమలాలతో పుష్పార్చన



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని దుర్గామాతకు 108 కమలాలతో శుక్రవారం మహిళలు పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ.. కమలాలతో పూజలు చేశారు.

ఒకరికి జైలు

ఎల్లారెడ్డిపేట: మహిళపై హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తికి ఏడాది జైలుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జిల్లా సబ్ కోర్టు న్యాయమూర్తి లక్ష్మణాచారి తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన వేముల శేఖర్ 2021లో వేముల శాంతవ్వపై కత్తితో దాడిచేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అప్పటి సీఐ భన్సీలాల్ దర్యాప్తు చేపట్టారు. సిరిసిల్ల సీఐ మొగిలి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షిని ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా సబ్ కోర్టు న్యాయమూర్తి లక్ష్మణాచారి శుక్రవారం తీర్పు వెలువరించారు.

జంక్షన్.. జర భద్రం !

- డేంజర్‌గా వెంకటాపూర్ జంక్షన్
- తరచూ ప్రమాదాలు
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్‌లో ప్రమాదకరంగా జంక్షన్

ఎల్లారెడ్డిపేట: మూడు రహదారులను కలుపుతూ..ఏర్పాటు చేసిన జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. జంక్షన్ జర భద్రం అంటూ.. ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఆ గ్రామస్తులు. చౌరస్తా వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి నేరుగా గురువారం ఇంటిని ఢీకొట్టాడు. ఇంట్లో ఉన్న ఇద్దరు చిన్నారులు బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని వెంకటాపూర్ శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి నుంచి రగుడు మీదుగా సిరిసిల్ల జిల్లాకేంద్రంతో సంబంధం లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుతో దూరం తగ్గడమే కాకుండా వాహనాల రాకపోకలు తక్కువగా ఉండడంతో ప్రయాణం సులభతరంగా మారింది. బైపాస్‌పై ఏడాదిన్నర క్రితం నుంచి రాకపోకలను ప్రారంభించారు. మూడు కూడళ్ల ఒకేచోట కలువడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్క ఏడాదిలోనే ఆ రోడ్డుపై ఉన్న జంక్షన్ వద్ద 21 సార్లు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. సుమారు ఇరవై మంది వరకు గాయపడ్డారు. డేంజర్ జంక్షన్‌గా మారినా దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదు.

పెరిగిన ప్రమాదాలు

సిరిసిల్ల పట్టణంతో సంబంధం లేకుండా ఉమ్మడి కరీంనగర్‌కు వెళ్లేందుకు రూ. 5కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుతో గతంలో కంటే 20 నిమిషాల ముందే ప్రయాణికులు గమ్యం చేరుతున్నారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డు కూడా డబుల్ రోడ్డు కావడంతో వాహనారులు ఇబ్బంది లేకుండా సకాలంలో సులువుగా కరీంనగర్ చేరుతున్నారు. కానీ డేంజర్ జంక్షన్ వద్ద మాత్రం కనీస చర్యలు తీసుకోవడం మరిచారు. దీంతో నూతన రహదారిపై ప్రయాణం వాహనదారులకు రక్షణ లేకుండా పోయింది.

కనిపించని హెచ్చరిక బోర్డులు..

వెంకటాపూర్ శివారులో నిర్మించిన జంక్షన్ వద్ద ఆర్ అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగం తగ్గించేందుకు హెచ్చరిబోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లు లేక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదాలతో వాహనదారులు కొత్త బైపాస్‌పై జంక్షన్‌ను దాటి ప్రయాణాలు చేసేందుకు భయపడుతున్నారు. దీనికి తోడు వెంకటాపూర్‌లో ప్రారంభమైన ప్రయాణం రగుడు వద్ద సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిని కలుస్తుంది. అక్కడ కూడా అధికారులు ముగింపు దశలో కూడా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఆ రోడ్డును కలిసే సమయంలో వాహనదారులు అతి వేగంతో ప్రయాణాలు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



రక్షణ చర్యలు చేపట్టాలి మూడు కూడళ్ల రోజు వాహనప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలతో బైపాస్ రోడ్డుపై ప్రయాణించేందుకు ప్రజలు భయపడుతున్నారు. జంక్షన్ దగ్గర అధికారులు వెంటనే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వెంకటాపూర్‌తో పాటు రగుడు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి.

– పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకటాపూర్

సిగ్నల్ ఏర్పాటు చేయాలి



వెంకటాపూర్ జంక్షన్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాలి. అక్కడ రెండుసార్లు ఆటోలు ప్రమాదాలకు గురయ్యాయి. జంక్షన్ కూడలిలో వాహనాలు స్పీడ్‌గా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి ఆనుకొని జంక్షన్ ఉండడం, జన సమూహం అధికంగా ఉండడంతో చివరకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– అజయ్, ఆటోడ్రైవర్, ఎల్లారెడ్డిపేట



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలోని తొమ్మిదో వార్డులో ఓ డ్రైనేజీపై స్లాబ్ లేకపోవడంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. ఆదమరిస్తే అంతే సంగతులు. ఈ ప్రాంతంలో వీధి లైట్ కూడా లేదు. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. డ్రైనేజీపై స్లాబ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
వినిల్, పంచాయతీ కార్యదర్శి, గంభీరావుపేట సెల్: 9553998124

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అసత్యపు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న జ్యోతి

ఇల్లంతకుంట: ఇందిరమ్మ ఇళ్లపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అసత్యపు ఆరోపణలు మానుకోవాలని మహిళా మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఇల్లంతకుంట మహిళా కాంగ్రెస్ సభ్యులు, నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, సమావేశమయ్యారు. అరుకాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని రసమయి ఆరోపించడం సరికాదన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకురాలు తీగల పుష్పలత, నాయకులు పసుల వెంకటి, యాస తిరుపతి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ కోరారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో పార్టీ గద్దె నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొమ్ము రాజశేఖర్, అక్కెనపల్లి సురేశ్, దండు ఐలయ్య, పిట్టల లచ్చయ్య, పసుల పోశయ్య, చక్రాల నర్సయ్య, గుంటి మల్లయ్య, తాండ్ర ప్రదీప్, రాములు, లచ్చయ్య, రమేశ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చందుర్తిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో 32మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, రూ.16,42, 042 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా లింగంపేట, ఎన్గల్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చెలుకల తిరుపతి, ఉపాధ్యక్షులు బొజ్జ మల్లేశం, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, కాసారావు శ్రీనివాస్, సాయి, మల్లారపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



సందీప్ కుమార్‌ఝాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్లారెడ్డిపేట ప్రతినిధులు

సిరిసిల్ల: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలెక్టరేట్‌లో ఎల్లారెడ్డిపేట ప్రతినిధులు శుక్రవారం కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా శాలువాతో సత్కరించి పూలమొక్క అందించారు. రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ సాబేర బేగం, కాంగ్రెస్ నాయకులు గౌస్, దొమ్మాటి నర్సయ్య, గూడ విజయ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సాయి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పట్టణాధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మోర శ్రీహరి, అంకారపు రాజు, కాంబోజ శ్రీధర్, పల్లికొండ నర్సయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొండ నరేశ్, మేర్గు శ్రీనివాస్, కార్యదర్శులుగా కోడం రవి, సూరం వినయ్, పంపరి అర్జున్ కోడం శ్రీనివాస్, కోశాధికారిగా ఇంజపురి మురళిని ఎన్నుకున్నారు. మరో 33 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా పట్టణాధ్యక్షులు సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఆరుగురికి రూ.లక్షా 17వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఇక్కడ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు వెంకట నర్సింహారెడ్డి, మీసం రాజం, పందిర్ల పర్శరాములు గౌడ్, ఎలగందుల నర్సింలు, గుండాడి వెంకట్‌రెడ్డి, బాధ రమేశ్, లావణ్య, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ముందస్తు అరెస్టు

ముస్తాబాద్: మండలంలో పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో పంచాయతీ కార్మికులు నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి మండలం నుంచి కార్మికులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వం జీరో వన్ జీరో పద్దు కింద వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మణ్, బాలమల్లు, సుధాకర్, స్వరూప, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో పురుగుల మందు తాగిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి: చీర్లవంచకు చెందిన వేల్పుల కృష్ణ ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో పురగుల మందుతాగి బెదిరింపులకు పాల్పడగా అతనిపై కోర్టు అనుమతితో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.ఉపేంద్రచారి తెలిపారు. తంగళ్లపల్లి మండల ప్రజలు సివిల్ విషయాలకు సంబంధించి తగాదాలుంటే కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో అధికారులను బెదిరింపులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

వేములవాడరూరల్: ప్రభుత్వ హాస్టళ్లలో ముడి సరుకులు సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దాదాపు ఆరు నెలలుగా ప్రభుత్వ హాస్టల్‌లో సరఫరా చేసే కోడిగుడ్లు, గ్యాస్, కూరగాయలు, పాలు, చికెన్, మటన్ ఇతర సామగ్రిని ఏడాది పాటు కాంట్రాక్టు తీసుకుంటారు. వీరికి ప్రభుత్వం ప్రతీ నెల బిల్లులు మంజూరు చేయాలి. కానీ గత నవంబర్ నుంచి ఇప్పటివరకు బిల్లులు రావడం లేదు. నేడో రేపో వస్తాయని కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి సామగ్రిని సరఫరా చేస్తున్నా ప్రభుత్వం నిధులు రాకపోవడంతో చాలామంది ఇక్కట్లు పడుతున్నారు. చిన్న కమీషన్ల కోసం ఆశపడి కాంట్రాక్టు పట్టుకుంటే మిత్తీలకు కూడా వచ్చిన కమీషన్ సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుసార్లు హైదరాబాద్ వెళ్లి నాయకులు, అధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు. జిల్లాలో దాదాపు 36 హాస్టళ్లు ఉంటాయి. కేజీబీవీ, టీటీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, బీసీ హాస్టల్ తదితర హాస్టల్‌లు ఉన్నాయి. ప్రభుత్వానికి అనుసంధానమైన డిస్ట్రిబ్యూటర్లకు జనవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

వేములవాడ : వేములవాడలో నివాసముంటున్న మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం, రిమ్మనగూడెంకు చెందిన దండి స్వరూప (45) ఈనెల 25 నుంచి కనిపించడం లేదని భర్త దండి వెంకన్న శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9440630721 లేదా 9951920020 నెంబర్లలో సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఎమ్మెల్సీ కవిత పరామర్శ

బోయినపల్లి: బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు సోదరుడు ప్రముఖ జనరల్ సర్జన్ చెన్నాడి రవీందర్‌రావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. రవీందర్‌రావు కుటుంబ సభ్యులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం పరామర్శించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ముద్రించిన ధరల కన్నా ఎక్కువ రేట్లకు విక్రయిస్తూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. వడ్లూరి సాయికిరణ్, షేక్ అఫ్రోజ్, వెంకటేశ్, ఎండీ అజ్జు, తిరుమలేశ్, రాకేశ్, పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25లో బీఏ తృతీయ సంవత్సరం చదివిన ఈసరి అఖిల్, శ్రీపురం మధుసూదన్ 2024 డిసెంబర్ 18 నుంచి 22 వరకు జరిగిన వాలీబాల్ సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో శాతవాహన విశ్వవిద్యాలయం తరఫున పాల్గొన్నారు. వీరికి శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్‌రావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట: దుమాల ఏకలవ్య గిరిజన గురుకులం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సారియా అంజుమ్ మాట్లాడారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ, హెల్త్ అసిస్టెంట్ బాబు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురిసిన వాన

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా వేములవాడరూరల్ మండలంలో 19.9 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 3.2, చందుర్తిలో 18.8, బోయినపల్లిలో 5.9, వేములవాడలో 8.9,సిరి సిల్లలో 11.9, కోనరావుపేటలో 16.0, వీర్నపల్లిలో 18.7, ఎల్లారెడ్డిపేటలో 10.7, గంభీరావుపేటలో 6.6, ముస్తాబాద్‌లో 13.7, తంగళ్లపల్లిలో 12. 3, ఇల్లంతకుంటలో 4.9 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 11.7 మిల్లీమీటర్లు నమోదైంది.

భవనం పైనుంచి పడి గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

వేములవాడ: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా భవన శిథిలాల కింద ఇనుప వస్తువులు సేకరించేందుకు వచ్చి భవనం పైనుంచి కింద పడడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజన్న ఆలయానికి సంబంధించిన వాణిజ్య సముదాయాల విస్తరణలో కూల్చేశారు. భవనంపై మిగిలిన సలాకను సేకరించేందుకు ఎక్కిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి కోనాయపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మర్రిపల్లికి చెందిన సంకెపల్లి వెంకటాచారి వేములవాడ నుంచి మర్రిపల్లికి వెళ్తున్నాడు.కోనాయపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్, బైక్ ఢీకొని గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

కూలీ హఠాన్మరణం

కోనరావుపేట: మల్కపేటకు చెందిన కుంట లింగయ్య (54) అనే వ్యవసాయ కూలీ మృతిచెందాడు. లింగయ్య తన ఇంటి సమీపంలో కూలిన ఇంట్లో సామగ్రి తొలగించే పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గంభీరావుపేట: మండలకేంద్రంతో పాటు ముస్తఫానగర్ తదితర గ్రామాల్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. కామారెడ్డి జిల్లా భవానిపేటకు చెందిన వ్యక్తులు పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు కామారెడ్డి తీసుకెళ్తుండగా ముస్తఫానగర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తె లిపారు. రెండు ద్విచక్ర వాహనాలను, ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

విగ్రహం చుట్టూ చెట్ల కొమ్మలే



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట గ్రామ పంచాయతీ భవనం పక్కనున్న అల్లూరి సీతారామరాజు విగ్రహంచుట్టూ చెట్ల కొమ్మలు అల్లుకున్నాయి. విగ్రహం ఎదురుగా ఉండి చూస్తే విగ్రహం కనిపించడం లేదని లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. పంచాయతీ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించి అల్లూరి సీతారామరాజు విగ్రహం కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి




ఇల్లంతకుంట: మండలంలోని ముస్కాన్‌పేటకు చెందిన సింగిరెడ్డి సంజీవరెడ్డి(54) శుక్రవారం రాత్రి సైకిల్ పైనుంచి పడి మృతిచెందాడు. ఇల్లంతకుంట నుంచి కూనబోయినపల్లి మీదుగా తన స్వగ్రామం ముస్కాన్‌పేటకు సైకిల్‌పై వెళ్తున్నాడు. కూనబోయినపల్లి వద్ద ఉన్న పైప్‌లైన్ కల్వర్టు వద్ద పడిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండచిలువ దాడిలో కోతి..

వీర్నపల్లి: మండలకేంద్రంలోని శ్మశానవాటిక ప్రాంతంలో కొండచిలువ దాడిలో కోతి మృతిచెందింది. గమనించిన దగ్గరలోని రైతులు కొండచిలువను హతమర్చారు. రైతులు మాట్లాడుతూ.. వాతావరణం చల్లబడంతో విషసర్పాలు బయటకు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

క్షయవ్యాధిని నిర్మూలించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఇల్లంతకుంట: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీనియర్ టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ జైత్యా అన్నారు.మండలంలోని గాలిపెల్లి పంచాయతీ ఆవరణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 22మంది అనుమానితుల నుంచి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. గాలిపెల్లి పల్లె దవాఖాన వైద్యులు కట్ట రమేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.